# దారి చూపరూ!

- సాయంత్రం అయితే అంధకారం
- అడవిని తలపిస్తున్న పార్కు
- శిథిలమైన కాలువలు
- అభివృద్ధికి దూరంగా పకీర్‌తక్యా కాలనీ

అక్కడ అన్నీ అందమైన ఇళ్లు.. బహుళ అంతస్తులు కూడా.. అయినా ఆ ఇళ్లకు వెళ్లాలంటే దారీ తెన్నూ ఉండదు. పొద్దు పోతే అంతా అంధకారమే. అయినా అక్కడి వారు అన్నీ భరిస్తూ నివాసముంటున్నారు. అయినా ఏ అధికారి పట్టించుకోరు. పాలకులు కనీసం కన్నెత్తి చూడరు. మురుగు నీరు కిందకు వెళ్లే మార్గం చూపాలని ఆ ప్రాంతీయులు నాయకులను కోరినా వారి మొర వినిపించుకోవడం లేదు. దీంతో ఆ కాలనీ వాసులు అవస్థల నడుమ జీవిస్తున్నారు. – కూర్మన్నపాలెం



అపార్టుమెంట్‌లను ఆనుకొని పెరిగిన ముళ్లపొదలు



పిచ్చి మొక్కలతో మూసుకు పోయిన రహదారి

### పిచ్చిమొక్కలతో నిండిన రోడ్లు

ఆ కాలనీకి వెళ్లే రహదారులన్నీ పిచ్చి మొక్కలతో నిండి పోయి దారీ తెన్ను లేకుండా తయారయ్యాయి. కాలువలు అన్నీ శిథిలమయ్యాయి. దీంతో వాడుక నీరు ఎక్కడికక్కడే నిలిచి పోయి ముక్కు పుటాలు అదిరిపోయే దుర్వాసన వెదజల్లుతోంది

### పట్టించుకోవడం లేదు



మేము ఇళ్లు నిర్మించుకొని ఎన్నో ఏళ్లగా నివాసం ఉంటున్నాం. కాని రహదారులు, వీధిలైట్లు, డ్రైనేజీలు వంటి సమస్యలు పట్టి పీడిస్తూనే ఉన్నాయి. కాలనీలో కనీస వసతులు కల్పించాలని అధికారులను, పాలకులను కోరుతునే ఉన్నాం. అయినా పట్టించుకోవడం లేదు. – సీహెచ్.సత్యప్రసాద్ ఫేజ్–5 కాలనీవాసి

### ఒంటరిగా రావాలంటే వణుకు



కాలనీకి ఆడవాళ్లు ఒంటరిగా రావాలంటే భయపడాల్సి వస్తుంది. దారి కనపడదు. మురుగు నీరు ఎక్కడి పడితే అక్కడ చేరి పోవడం వల్ల జారి పడతమన్న భయం వెంటాడుతుంది.మా కష్టాలు ఎప్పుడు తీరుతాయో మరి!.

– నాజ్, పకీర్‌తక్యా, కూర్మన్నపాలెం

**జీ**వీఎంసీ 86వ వార్డు పరిధిలో పకీర్‌తక్యా ఫేజ్–5 కాలనీ ఉంది. ఇది ఖరీదైన రాజీవ్‌నగర్‌కు ఆనుకొని ఉంది. ఆ కాలనీ దుస్థితి చూస్తే ఎవరికైనా మతి పోతుంది. పకీర్‌తక్యాకు ఆనుకొని నాలుగు ఎకరాల స్థలంలో 2005లో లేఅవుట్ వేశారు. వుడాతో పాటు ప్రభుత్వానికి చెందిన అన్ని అనుమతులు లభించాయి. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకొనేవారు సొంత గృహం నిర్మించుకోవచ్చునని అప్పట్లో ప్లాట్లు కొనుగోలు చేశారు. ఆ తర్వాత రోడ్లు, కాలువలు నిర్మించడంతో ఇళ్లు నిర్మించి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. **మరికొం**దరు బిల్డర్లకు ఇ**వ్వడం**తో అపార్ట్‌మెం**ట్‌లు** వెలిశాయి. ప్రస్తు**తం** అక్కడ దాదా**పు** 300కు పైగా కుటుం**బా**లు నివాసము**ం**టున్నాయి. వా**రు** ఇళ్లకు వెళ్లేందు**కు** సరైన రహదారి **లేక** అవస్థలు పడు**తు**న్నారు.



అడవిని తలపిస్తున్న పార్కుకు కేటాయించిన స్థలం

**నామరూపాల్లేని పార్కు**

ఇక పార్కు విషయానికి వస్తే అక్కడ అటువంటి జాడే కనిపించడం లేదు. పెద్ద పెద్ద చెట్లతో నిండిపోయి చిట్టడవిని తలపించేలా తయారైంది. దీంతో పార్కుకు వెళ్లాలంటేనే హడలి పోతున్నారు.

**అరకొర వెలుగులు**

కాలనీలో సాయంత్రం అయితే అంధకారం అలముకుంటుంది. కాలనీ వాసులు చీకటిపడితే ఇంటినుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తమ పరిస్థితి ఉందనిఆందోళన చెందుతున్నారు.

### కనీస వసతులు లేవు



మేము పూర్వకాలం నుంచి ఇక్కడే ఉంటున్నాం. కాలనీ రాక ముందు నుంచి ఇళ్లు నిర్మించుకున్నాం. సదుపాయాలు మాత్రం అప్పుడు ఎలాగున్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి.ఎటువంటి మార్పులేదు.

–సజీద్‌బాను, పకీర్‌తక్యా కాలనీ

## క్లుప్తంగా

### ఉక్కు హెచ్ఆర్ అధికారి భానుకు సత్కారం



అవార్డు గ్రహీత భానును సత్కరిస్తున్న హెచ్ఆర్ అధికారులు సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్, ప్లాంట్ పర్సనల్ ఇన్‌చార్జి ఎస్. భానును మంగళవారం హెచ్ఆర్ అధికారులు, సిబ్బంది సత్కరించారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె కేంద్ర ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని హెచ్ఆర్ కాన్ఫరెన్స్ హాలులో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ డీజీఎం డాక్టర్ రాధిక మాట్లాడుతూ హెచ్ఆర్ అధికారిగా భాను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు లభించడం స్టీల్‌ప్లాంట్‌కు గర్వకారణమన్నారు. సన్మాన గ్రహీత భాను మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ అధికారులు సువేందు కుమార్ ఖర్, వి.ఎల్.పి. లాల్, బి. జోగారావు తదితరులు పాల్గొన్నారు.

### క్రిమిటోరియం భవన నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

గాజువాక: చినగంట్యాడ శ్మశానవాటికలో రూ.1.50 కోట్లతో చేపట్టిన ఎలక్ట్రికల్ క్రిమిటోరియం భవన పనులను 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం శ్లాబ్ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే భవనం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎలక్ట్రికల్ క్రిమిటోరియం ద్వారా మృతదేహాల దహనం మరింత సులువవుతుందన్నారు. ఆయనతోపాటు సహాయ ఇంజినీరు వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సూర్యారావు, సుధాకర్, స్థానిక నాయకుడు జి.ఆనంద్ తదితరులున్నారు.

### కొత్త ఆవిష్కరణలతో సవాళ్లకు చెక్



హ్యాక్‌థాన్ ఆవిష్కరణ చేస్తున్న అతిథులు, విద్యార్థులు

అగనంపూడి: పారిశ్రామిక రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి సరికొత్త ఆవిష్కరణలు అత్యవసరమని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో హ్యాక్‌థాన్ జాతీయ స్థాయి ఫెస్ట్‌లో భాగంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పరిశ్రమలు కొత్త కొత్త సమస్యలను ఎదుర్కొంటున్నాయని, వాటిని సరికొత్త ఆవిష్కరణలతోనే ఎదుర్కొనే శక్తి ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారంలో వేగం, సమష్టి ఆలోచన, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సమన్వయం, వంటి నైపుణ్యాలను మెరుగుపర్చుకోడానికి హ్యాక్‌థాన్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు దేవన్న, గురుచరణ్, చైతన్య పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం



మేరీ సుజాతను సత్కరిస్తున్న హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న గడ్డం మేరీ సుజాతను మంగళవారం యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా పని చేస్తున్న మేరీ సుజాత విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే విధంగా వారితో మొక్కలు నాటించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

## సినర్జీస్ కార్మికులది ఆకలి పోరాటం



సినర్జీస్ కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న ఏఐటీయూసీ నేత వెంకటరావు

అగనంపూడి: సినర్జీస్ కార్మికులు చేసేది సమ్మె కాదని, ఆకలి పోరాటమని ఏఐటీయూసీ జిల్లా నాయకులు బూసి వెంకటరావు అన్నారు. ఐదు రోజులుగా దువ్వాడలో సినర్జీస్ కార్మికులు కొనసాగిస్తున్న ఆందోళన కార్యక్రమానికి మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఆరు మాసాలు జీతాలు చెల్లించకుండా కార్మికుల కుటుంబాలను పస్తులకు గురిచేస్తున్న యాజమాన్యం తీరు సరికాదన్నారు. కంపెనీ చట్టం 447 ప్రకారం జీతాలు చెల్లించకపోవడం ఆర్థిక మోసం, దగాగా భావించి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆకలి కేకలు కూటమి ప్రభుత్వ పెద్దలకు వినపడడం లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను కోత విధిస్తున్నా ఆయా ఖాతాలకు జమ చేయకుండా మింగేయడం వల్ల కార్మికులు తీరని నష్టానికి గురవుతున్నారన్నారు. బకాయి వేతనం వెంటనే చెల్లించాలని, యాజమాన్యం దిగిరాకపోతే న్యాయపోరాటాం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికుల ప్రతినిధులు ఎ.దాస్, బి.రమణ, ఉదయ్‌కుమార్, బషీర్, పి.ఆనంద్, ఎం.శ్రీనివాస్, సుదర్శనరావు పాల్గొన్నారు.

## పేదింట్లో ఉడకని కంది పప్పు!

**రేషన్‌లో కందిపప్పు సరఫరా చేయని ప్రభుత్వం**

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదార మినహా అదనపు సరకులు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు నిరాశకు గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా చెంతకే వచ్చి నిత్యావసర సరకులు అందించే వారు. ప్రస్తుతం లబ్ధిదారులు రేషన్ సరకుల కోసం డిపోల వద్ద పడిగాపులు కాసినా బియ్యం, అరకిలో పంచదార తప్పా ఏమీ ఉండకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రానున్న విజయదశమి పండగ సందర్భంగా బియ్యంతో పాటు కందిపప్పు ఇతర సరకులు ఇస్తారేమో అని ప్రజలు ఆశపడ్డారు. పేదింట్లో పప్పు అన్నం తినలేని పరిస్థితి ఏర్పడిందని నిట్టూరుస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు అందించే కందిపప్పు కొన్ని నెలలుగా నిలిచిపోయింది.ఏ నెలకు ఆనెల కార్డుదారలు ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ కంది పప్పు మాత్రం పరఫరా కావడం లేదు. డీలర్లను అడుగుతుంటే వారు మాత్రం ప్రభుత్వం నుంచి సరఫరా లేదంటూ సమాధానమిస్తున్నారు.




గతంలో పంపిణీ చేసిన కందిపప్పు

### లేదంటే ఎలా..



రేషన్ డీలర్లు బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని చెబుతున్నారు. గతంలో కిలో కంది పప్పు రూ. 67 కే అందించేవారు.దీంతో కుటుంబంలో కొంత ఊరట కలిగేది. ప్రభుత్వం చొరవ చూపి పేదలకు కందిపప్పు అందిచేలా చర్యలు చేపట్టాలి.

– మద్ది శంకరమ్మ,నెల్లిముక్కు, పెదగంట్యాడ.

## ఉక్కు డీఏవీ విద్యార్థులకు పతకాల పంట



విజేతలను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని డీఏవీ పాఠశాల విద్యార్థులు అంతర పాఠశాలల జోనల్ క్రీడా పోటీల్లో 44 బంగారు పతకాలు, 60 కాంస్య పతకాలు, 3 రజత పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సుగంధ కుమారి తెలిపారు. సోమవారం విజేతలను అభినందించి సాధించిన పతకాల వివరాలు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 8వ వరకు రాజాంలోని జీఎంఆర్ డీఏవీ పాఠశాలలో జరిగిన జోనల్ క్రీడా పోటీల్లో ఉక్కు డీఏవీ పాఠశాలకు చెందిన 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర అండర్–17 విభాగంలో వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం, బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం గెలుపొందారు. అదే విధంగా బాలికల అండర్–17 పోటీల్లో వాలీబాల్, యోగా పోటీల్లో ప్రథమ స్థానం, బాస్కెట్ బాల్ పోటీల్లో ద్వితీయ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. బాలికల అండర్–14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్‌లో అండర్–17 బాలుర విభాగంలో 100 మీ, 200 మీ పరుగు పందెం పోటీల్లో మాస్టర్ షణ్ముఖ శివాజి మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. అథ్లెటిక్స్ బాలికల అండర్–14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో చాందిని , రిలేప రుగులో హైమ తేజశ్వి జట్టు మొదటి స్థానం సాధించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో గిరీశ్వరరెడ్డి రజత పతకం గెలుపొందాడు. కార్యక్రమంలో మేనేజర్ వి. శ్యామల పాల్గొన్నారు.

## కరూర్ వైశ్యాబాంక్ వడ్లపూడి శాఖ ప్రారంభం



శాఖను ప్రారంభిస్తున్న షిప్‌యార్డు డైరక్టర్ కిరణ్

కూర్మన్నపాలెం: కరూర్ వైశ్యాబ్యాంక్ వడ్లపూడి శాఖను మంగళవారం హిందూస్థాన్ షిప్‌యార్డు ఫైనాన్స్ డైరెక్టర్ ఇ.కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఖాతాదారులకు డిపాజిట్ సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక సమస్యలతో వివాహిత ఆత్మహత్య



ప్రత్యూష మృతదేహం

కూర్మన్నపాలెం : అశోకనగర్‌లోని ఎస్‌కే రెసిడెన్సీలో నివాసం ఉంటున్న 38 ఏళ్ల వివాహిత పిన్నంరాజు ప్రత్యూష మానసిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఆమె అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైకి వెళ్లి దూకింది. తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ప్రత్యూష తొమ్మిదేళ్లగా మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఆమె భర్త పి.అనేష్ అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో పనిచేస్తున్నాడు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. తమ కుమారుడి చదువు కోసం ఇటీవలే రాంబిల్లి నుంచి అశోకనగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. వారికి వివాహమై 16 ఏళ్లు అయిందని పోలీసులు తెలిపారు. సంఘటనపై ప్రత్యూష తండ్రి, రిటైర్డ్ ఉక్కు ఉద్యోగి పాకలపాటి సత్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమార్తె మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బనారస్ రైలుకు అంకోరా స్టేషన్‌లో హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం(18523/18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11వ తేదీ నుంచి అంకోరా స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు. విశాఖపట్నం–బనారస్(18523) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు ఉదయం 5.08 గంటలకు చేరుకుని 5.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విశాఖపట్నం(18524) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు సాయత్రం 6.40 గంటలకు చేరుకుని 6.42 గంటలకు బయల్దేరుతుంది.

## నేడు డయల్ యువర్ ఆర్ఎం

దాబాగార్డెన్స్: డయల్ యువర్ ఆర్ఎం పేరిట బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కాకినాడ, రాజమండ్రి సెక్టార్స్ వారు కూడా డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమంలో పాల్గొని సలహాలు, సందేహాలు ఇవ్వొచ్చు. ఆసక్తి గల వారు 9959225580 నెంబరుకు డయల్ చేయాలన్నారు.

## సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించాలి

- గేర్ మార్కింగ్‌పై సదస్సులో వక్తలు



సదస్సుకు హాజరైన అధికారులు, మత్స్యకారులు

ఏయూ క్యాంపస్ : కేంద్ర మత్స్య సాంకేతిక పరిశోధన సంస్థ (సీఐఎఫ్‌టీ) ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని సంస్థ కార్యాలయంలో భారతీయ మత్స్య పరిశ్రమలో గేర్ మార్కింగ్ – అవకాశాలు, సవాళ్ల అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడం అత్యంత అవసరమన్నారు. సవాళ్లు, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా ఆలోచించేందుకు గేర్ మార్కింగ్ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. గేర్ మార్కింగ్‌పై జాతీయ మార్గదర్శకాలను రూపొందించడానికి మత్స్యకారులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ – సీఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.రఘు ప్రకాష్ మాట్లాడుతూ గేర్ మార్కింగ్‌పై ప్రపంచ స్థాయిలో జరుగుతున్న విధానాలను వివరించారు. చట్ట విరుద్ధంగా చేపల వేటను తగ్గించడానికి, వివాదాలను పరిష్కరించడానికి ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. గేర్ మార్కింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించే రంగుల కోడింగ్ తోపాటు అధునాతన రేడియో ఫ్రీక్వెన్సీ(ఆర్ఎఫ్) ట్యాగ్‌ల వినియోగం, తదితర అంశాలను వివరించారు. డాక్టర్ బి.మధుసూధనరావు మాట్లాడుతూ పెరుగుతున్న సముద్ర కాలుష్యం, చట్ట విరుద్ధమైన చేపల వేటను నియంత్రించడానికి గేర్ ట్రేసబిలిటీని ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంఘం, డాల్ఫిన్ బోట్ ఆపరేటర్లు, వలల తయారీదారులు, చిన్న తరహా మత్స్యకారులు, మత్స్య సంస్థలు, ఎన్‌జీవోలు, ఫిషింగ్ గేర్ తయారీ సంస్థల ప్రతినిధులు స్వయంగా సెషన్‌లో పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారు. దేశంలో గేర్ మార్కింగ్ అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై ప్రత్యేక చర్చ నిర్వహించారు. డాక్టర్ యు.శ్రీధర్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త జి.కమై తదితరులు పాల్గొన్నారు.